# ఇలాగ ఎందరో!!

రచన:
శ్రీ పుర్రెవీర వెంకట సత్యనరశింగరావు

[కథలకు, జీవితాలకు ఎంత దగ్గిర సంబంధం. సాహిత్యం జీవితాన్ని మారుస్తుందా? ఎన్నో రచనలు చేసిన నేను సైతం భ్రాంతిలో పడక తప్పలేదు.

జీవితం రంగు రంగుల చిత్రం. మనిషి ఒక కళాకారుడు. కుంచె పట్టుకుని చిత్రానికి రంగులు దిద్దుతూ వైటంగ్ షేడ్స్ ఇస్తాడు ఓ ఆర్టిస్టు. ఏ రంగు ఎక్కువైనా, ఏ రంగు కలవకపోయినా ఆ చిత్రం దెబ్బతింటుంది.

అలాగే జీవితచిత్రంలో కోపతాపాల వివిధ మనస్తత్వాల రంగుల్ని నేర్పనే కుంచెతో చాకచక్యంగా కలుపుకుపోలేక పోతే ఆ జీవితమే దెబ్బతింటుంది. ఆ విషయాన్నే పాత్రలు కల్పించి 'ఇలాగ ఎందరో' కథ రాశాను.

శాంతి ఫణేంద్రుల జీవితాల్ని చక్కదిద్దిందది.

—రచయిత.]

★

ఆ రోజు అర్జంటుగా ఆఫీసు పనిమీద రాజమండ్రి వెళ్ళవలసి వచ్చింది. ఆ పని పూర్తి కావడానికి అక్కడ రెండ్రోజులు వుండవలసి వుంది.

రాజమండ్రి చేరుతుండగా నా కార్యక్రమాన్ని నెమరు వేసుకుంటూ, వసతి గురించి ఆలోచించుకుంటున్నాను. బస్సు తిన్నగావచ్చి స్టేండులో ఆగింది. సూట్ కేసు పట్టుకుని దిగాను.

"అన్నయ్యా!" అంటూ ఎక్కణ్ణుంచో పిలుపు వినవచ్చింది.

నన్ను కాదన్నట్టు ముందుకి నడిచాను. మళ్ళీ అదే పిలుపు.

"ఎవరో అమ్మాయి తమర్ని పిలుస్తున్నారండి!" రిక్షా వాడు చెప్పాడు.

నేను అటు చూశాను. ఆనందంతో వడి వడిగా అటు నడిచాను.

"బాగున్నావా? అన్నయ్యా! అసలు మమ్మల్ని మర్చిపోయి వుంటావులే. అవును నీకు స్వంతచెల్లెల్ని కానుగా?" అంది.

ఆ మాటలంటున్నా ఆమె హృదయం వెనుకవున్న ఆప్యాయత, ఆ కళ్ళ వెనుక దాగివున్న పూజ్యభావం నాకు కనబడుతోంది.

"ఎంతమాట శాంతీ! నిన్ను నా చెల్లెలిగానే భావిస్తున్నాను. పదేళ్ళ వయస్సులోనే తన దివ్యస్మృతులు మాకు వదిలి వెళ్ళిపోయిన మా లక్ష్మిని నీలో చూసుకుంటూ గడిపాను. ఆ రోజులు నేనెప్పుడూ మర్చిపోలేదు. మీ కుటుంబ సభ్యుల్లో నేనొకణ్ణి. ఆ నాడు మీ నాన్నగారు విద్యాబుద్ధులు నేర్పించి, ఉద్యోగమిప్పించక పోతే నేను ఈ నాడు ఈ పరిస్థితిలో వుండేవాణ్ణేనా?"

"మరైతే నా పెళ్ళికి రాలేదేమి?"

"ఈ ఒక్క విషయంలో క్షమించు. వెడ్డింగ్ లేటుగా అందింది. అందుకే నీ పెళ్ళికి రాలేక పోయాను."

"పోన్లే అన్నయ్యా! ఇప్పటికైనా మేం గుర్తుకొచ్చాం. పద ఇంటికి వెళ్దాం."

"వస్తానమ్మా! ఇంతదూరం వచ్చి నాన్నగార్ని కలుసుకోకుండా వెళ్తానా? ఇప్పుడు అర్జంటుగా తాలూకాకి వెళ్ళవలసి వుంది. అన్నట్టు అమ్మా, నాన్న కులాసాయేనా?"

"కులాసే అన్నయ్యా! నీవు వచ్చేముందు కాకినాడ, చిన్నాన్న ఇంటికి వెళ్ళారు. వాళ్ళను దిగబెట్టడానికే నేను బస్టాండ్ కి వచ్చింది కూడాను."

"అలాగా! అయితే, నాన్నగార్ని చూడ్డం పడదు కాబోలు."

"....................."

"శాంతీ! బావగారు రాజమండ్రిలో వుంటున్నారా?"

"లేదన్నయ్యా! వారు చోడవరంలో వుంటున్నారు. అమ్మా, నాన్న రాజమండ్రిలోనే సెటిల్ అయిపోయారు. నేను ప్రస్తుతం పుట్టింట్లోనే వుంటున్నా."

"నువ్వు చెప్పేదేమిటో నా కర్థం కావడం లేదు శాంతీ!"

"ఇంకా ఏం చెప్పలేనన్నయ్యా? అంతా ఇంటికి చేరిన తర్వాత చెపుతాను. ముందు ఇంటికి నడు. తాలూకాకి ఇంకా గంటన్నర టైం వుంది." శాంతి వెనుక వెళ్ళక తప్పలేదు నాకు.

* * *

నేను వచ్చిన పని పూర్తయింది. ఈ రెండ్రోజులూ శాంతి సమక్షంలో కొన్ని గంటలు మాత్రమే గడపగలిగాను. శాంతి ఆదరణలో లోటు లేదు. నవ్వుతూ కబుర్లు చెప్పింది. కానీ శాంతి గుండెల్లో ఏదో దిగులు వుంది. విడమరచి చెప్పలేక పోతోంది. భర్త విషయం ప్రస్తావించేసరికి ముక్తసరిగా జవాబిస్తుంది.

ఆ రోజు తెల్లవారితే వైజాగ్ వచ్చేస్తాననగా, ఆ సాయంత్రం శాంతి వంటపన్లో వున్నప్పుడు, ఆమె గదిలో ప్రవేశించాను. గదంతా చాలా నీట్‌గా వుంది. ఎదురుగా టేబుల్ మీద కొన్ని పత్రికలు పడివున్నాయి. పరిశీలన చేస్తే అందులో నా కథలు పడ్డ పత్రికలు కూడా కొన్ని వున్నాయి. ప్రక్కగా షెల్ఫ్‌లో కొన్ని స్క్రిప్ట్ లున్నాయి. యద్దనపూడి, ముప్పాళ, కుటుంబరావు కథల పుస్తకాలు టేబుల్ మీద దొంతి పెట్టి వున్నాయి. శాంతి కాలక్షేపానికని తెచ్చుకున్న పుస్తకాలవి. వాటిమధ్య నాకు శాంతి రాసుకున్న డైరీ దొరికింది. అలవోకగా పేజీలు త్రిప్పసాగాను.

"వారు చూడ్డానికి చాలా మంచివారులా కన్పిస్తున్నారు. అన్ని విధాలా నాకు నచ్చారు కూడా. వారి ఆదరణ, అనురాగాల్లో నా జీవితం మూడు పువ్వులూ, ఆరు కాయలుగా వికసిస్తుందని ఆశిస్తున్నాను. ఇటువంటి భర్తను ప్రసాదించినందుకు ఆ భగవంతుని మనసారా ప్రార్థిస్తాను...."

అయితే, శాంతికి మంచి భర్తే లభించాడన్న మాట. మరి ఈ పరిణామం ఏమిటి?

21, జనవరి-1930

"ఎప్పుడూ వారిలో అంత ఆగ్రహాన్ని చూడలేదు. నాన్నగారు ఇవ్వవలసిన కట్నం తాలూకు ఐదు వేలు కారణాంతరాల వల్ల ఇవ్వలేక పోయారు. పండక్కి పెట్టిన బట్టలు వగైరా తిరస్కరించి పెద్ద రభస చేసి నన్ను తీసుకు పోయారు. వారికి ఎలా సర్ది చెప్పాలో నాకు పాలుపోవడం లేదు....

వీళ్ళు డబ్బు మనుషులు కాబోలు ననుకున్నాను.

2, మార్చి-1930

"సరదాగా నేనూ వుద్యోగం చేస్తానన్నాను." "పోడి బి. ఏ. చదివి ఏం వుద్యోగం వెలగబెట్టేస్తావు? చాల్లే, ఇంకెప్పుడూ ఇలాంటి ప్రస్తావన తేకు." అంటూ రుసరుసలాడి పోయారు. ఏమిటో రానురాను ఆయన పాలసీ నా కర్థం కాకుండా పోతోంది."


మేలైన పొగాకుతో, అత్యుత్తమమైన ఆకులతో, నిపుణులైన పనివారులచే తయారుచేస్తున్నాము.

మల్లిస్సేరి బీడీలు

అత్యుత్తమమైనదని లక్షలాది ప్రజలు వాడుతున్నారు.




Grams: "Mallisseri" Phone: 24031

**Mallisseri Beedi Works**

**SULLIVAN STREET: COIMBATORE - 641 001.**

అదర్శ భావాల్లేని సంకుచిత మనస్తత్వం గల వ్యక్తిలా వున్నాడు.

14, సెప్టెంబరు-1930

"ఏమండీ! ఖాళీగా కూర్చుంటే వూసుపోవడం లేదు. నవల్సు రాయమంటారా? ఎప్పటినుంచో నవల్సు రాయాలని వుంది." అని అడిగాను ఓరోజు.

"ఏం? నేను నలుగురిలో తలెత్తుకు తిరగడం నీకు ఇష్టంగా లేదా? ఫలానా రచయిత్రి మొగుడు అని అందరూ వేలెత్తి చూపితే నాకు ఎంత అప్రతిష్ట...." ఇలా మండి పడ్డారు.

నా అభిమానం దెబ్బ తింది. సహనం సన్నగిల్లింది.

"ఎందుకండీ, ప్రతి విషయానికి రభస చేస్తారు. ఏం? నవల్సు రాస్తే తప్పేముంది? మీకోసం నా హాబీలు చంపుకో మంటారా? మీరేమనుకున్నా నేను నవల్సు రాస్తాను...." నోట్లో మాట నోట్లోనే వుంది. నా చెంప చెల్లుమంది. "నా మాట కాదన్న దానివి నా ఇంట్లో వుండడానికి వీల్లేదు. ఊఁ-గెటవుట్!....నీ ముఖం నాకు చూపించకు!...."

ఇంక పేజీలు తిరగెయ్యలేక పోయాను. శాంతికి అన్యాయం జరిగింది. నుదుటిమీది చెమట తుడుచుకుంటు న్నాను. అంతలో శాంతి అక్కడకు వచ్చింది. నా వునికిని కప్పి పుచ్చుకోడానికి ప్రయత్నించి విఫలమయ్యాను. డైరీ ఇంకా నా చేతిలోనే వుంది.

"క్షమించు శాంతీ! అనుకోకుండా నీ డైరీ కంట బడిందని సహజత్వం కోల్పోయిన నా మాటలు అవి.

ఇద్దరిమధ్య క్షణం నిశ్శబ్దం!

శాంతి హృదయంలోని బాధ వెల్లువలా పైకి వచ్చింది.

"అన్నయ్యా! నా కథ నీతో చెప్పుకుందామని ఈ రెండ్రోజులు ఎంతో పరితపించి పోయాను. కానీ అభిమానం అడ్డు వచ్చింది. పోనీలే! నేవైనా తెలుసుకున్నావు. నా బ్రతుకు నాశనమై పోయిందన్నయ్యా! నాశనమై పోయింది!...." శాంతి కన్నీరు తుడుచుకుంటోంది ఆ మాటలంటూ.

"ఊరుకో శాంతీ! బాధ పడకు. నీ జీవితాన్ని నేను చక్క జేస్తాను." అంటూ ధైర్యం చెప్పాను. కొంతసేపు ఇద్దరిమధ్యా మౌనం.

"శాంతీ! నువ్వు నవల్సు రాస్తున్నావా?"

"అవునన్నయ్యా! చూస్తావా?" అంటూ సెల్ఫ్‌లోని స్క్రిప్ట్‌లు తెచ్చి యిచ్చింది చేతికి.

ఒకటి మచ్చుకి చదివాను. పేరు "లైట్ అండ్ షేడ్స్". ఇంచుమించు నవల్లో జీవిత ఛాయలు కన్పించాయి. చాలా వెరైటీ నవల. నవల్లో అడుగడుగునా హీరో సెంటిమెంట్స్ ఎత్తి చూపుతున్న చిత్రీకరణ. ఈ నవలకి ముగింపు మరోలా వుంటే బావుండేది. మరో రెండు కథలు లైట్‌గా చదివాను. ఫరవాలేదు.


చిరకాల మన్నిక - అతి ప్రకాశవంతమైనది - నవీన పనితనము!




నోవెల్ వజ్రములు

నగలను అలంకరించుటకు,

విశిష్టతకు ప్రసిద్ధి చెందినది.

**అన్నివిధములైన కలర్ కమలములూ**

**మా వద్ద దొరుకును.**

మా వజ్రములకు గ్యారంటీ ఇవ్వబడును.

వివరములకు:

**Phone No. 27468**

# Novel Diamond Works

**2-C, Chinna Sowrastra St. : : TIRUCHIRAPALLI - 620 008.**

శాంతి రచయిత్రిగా రాణించే సూచనలు కన్పిస్తున్నాయి.

"కథలు బాగున్నాయా అన్నయా!" నా కళ్ళలోనికి ఆశగా చూస్తూ అంది.

"ఆఁ, బాగున్నాయమ్మా! అవునూ, నీకు నవల రాయడానికి ఇన్స్పిరేషన్ ఎక్కణ్ణుంచి వచ్చింది?"

శాంతి నవ్వుతూ అంది - "ఇవన్నీ నిన్ను చూసి నేర్చుకున్నావన్నయ్యా! మొదటి నుంచీ నీ కథలు చదువుతూనే వున్నాను. ఈ మధ్య వూసుపోక రచనా వ్యాసంగం సాగించాను."

మళ్ళీ శాంతి అంది - "అన్నయ్యా! ఈ మధ్య నీ కథలు రావడం లేదేం?"

"పని వత్తిడివల్ల రచన కుంటు పడిందమ్మా! నీ ఆర్టికల్స్ెందుకు పత్రిక్కి పంపలేదు?" తిరిగి ప్రశ్నించాను.

"వారు ఒప్పుకో రన్నయ్యా! నవల్సు రాస్తానంటేగా ఇంటి నుంచి గెంటేశారు!"

"అలాగా?....నీకిష్టమైతే నీ ఆర్టికల్సు నా పేరున పంపిస్తాను. ఏమంటావు?"

"నీ ఇష్టమే, నా యిష్టం అన్నయ్యా!"

"ఇప్పటికే లేటయింది. రా అన్నయా, భోం చేద్దువుగాని. అవతల నీకు ట్రైన్‌కి వేళవుతుంది."

"సరే, వడ్డించమ్మా! నేను కాళ్ళు కడుక్కు వస్తాను."

* * *

నేను వస్తుండగా శాంతి ఇచ్చిన ఫోటోను బట్టి, శాంతి భర్త ఫణేంద్ర అని తెలిసింది. రీసెంట్‌గా ఫణేంద్ర, రాజుకి రాసిన లెటర్‌ని బట్టి అతడు చోడవరంలోనే వుంటున్నట్టు తెలిసింది. ఫణేంద్ర ఇలా మారినందుకు నాకు చాలా విచారంగా వుంది. ఫణేంద్ర ఇంతకుముందే నాకు తెలుసునని ఎందుకో శాంతితో చెప్పలేక పోయాను.

ఒకనాడు వీలు చూసుకుని ఫణేంద్రను కలుసుకున్నాను. శాంతి విషయంలో ఫణేంద్రతో ఘర్షణ కూడా జరిగింది. ఏదైనా తెగే వరకూ లాగకూడదుగా! ఆ విషయమే నా శ్రేయోభిలాషియైన శాంతి తండ్రిగారికి లెటర్ మూలంగా రాశాను. ఈ క్లిష్ట సమస్యను కాలమే పరిష్కరించాలన్నాను.

* * *

కొన్నాళ్లు గడిచాయి. కాలప్రవాహంలో ఎన్నో మార్పులూను, చేర్పులూను. మళ్ళీ నా కథలు పత్రికల్లో వస్తున్నాయి. అభిమానుల దగ్గరనుంచి వుత్తరాలు వస్తున్నాయి. నిజానికి అవన్నీ శాంతికి దక్కవలసినవి. ఆమధ్య నవలాను బంధంలో వచ్చిన "లైట్ అండ్ షేడ్స్" నవల వాస్తవానికి చాలా దగ్గరగా వుందని, ఆ నవల్లో హీరో లాంటి వ్యక్తులకు కనువిప్పు కలిగిస్తుందని, 'నీరు ఎప్పటికయినా పల్లానికే వస్తుంద'న్నట్లు ఎప్పటికయినా అటువంటి వ్యక్తులు ఒక మెట్టు దిగక తప్పదని - ఇలా ఎన్నెన్నో రాశారు. అయితే, ఈ నవల నా పేరు చుట్టూ మరో మెరుపు గీత గీచిందన్న మాట.

ఆ రోజు ఆఫీసు టైమ్‌లో పోస్టుమేన్ నాకు కొన్ని ఉత్తరాలు అందించి వెళ్ళిపోయాడు. అందులో నా దృష్టి రోజ్‌కలర్ కవరుమీద పడింది. మిగతావి అట్టే పెట్టి, ఆ కవరు విప్పి చదవసాగాను.

అన్నయ్యకి అభినందనలు!

నీ కృషి ఫలితంగా నా సంసారం కుదుటపడింది. ఫణేంద్రలో మార్పు వచ్చింది. వారే స్వయంగా వచ్చి తన తప్పు క్షమించమని కోరారు. గతాన్నిమరచి తన వెంట రమ్మన్నారు.

అమ్మా నాన్నా చాలా సంతోషిస్తున్నారు, నా కాపురం కుదుట పడినందుకు నీవు త్వరగా వదిన్ని పిల్లల్ని తీసుకుని వచ్చి ఈ చెల్లెలు ఆతిథ్యం స్వీకరింపక తప్పదు. ఇంతకీ కారణం నీవురాసిన 'ఇలాగ ఎందరో' కథ ఏదో పత్రికలో చదివారట. నీ గురించి అంతా విపులంగా చెప్పుకున్నాం. నీవు వచ్చినతర్వాత మరిన్ని విషయాలు మాట్లాడుకుందాం. వెంటనే బయలుదేరి రావాలి. నీ రాకకోసం ఎదురుచూస్తూ,

నీ చెల్లెలు,
శాంతి.


TRADE MARK
PANJU TEX

మన్నికకు, ఆహ్లాదానికి....

పంజు టెక్స్ వారి

★ మాస్టర్ ★ ఫాంటెక్స్

ఫైన్ బనియన్లనే వాడండి.

ఆంధ్రా మరియు, ఒరిస్సా ఏజెంట్లు :—

దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం-4.